www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 30 నవంబర్ 2024

5

తిరుపతి

# నైరుతి బంగాళాఖాతంలో తీవ్రవాయుగుండం

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** గడిచిన 6 గంటల్లో గంటకు పది కిమీ వేగంతో కదులుతున్న తీవ్ర వాయుగుండం తుపానుగా ఏర్పడనుందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతానికి పుదుచ్చేరికి 320 కిలోమీటర్లు, చెన్నైకి 340 కిలోమీటర్లు దూరంలో కేంద్రీకృతం వాయువ్య దిశగా కదులుతూ రాగల 3 గంటల్లో తుపానుగా బలపడే అవకాశం వుందని, శనివారం మధ్యాహ్నానికి ఉత్తర తమిళనాడు -పుదుచ్చేరి తీరాల సమీపంలో కారైకాల్, మహాబలిపురం మధ్య పుదుచ్చేరి దగ్గరలో తుపానుగా తీరం దాటే అవకాశం వుందని, ఫలితంగా దక్షిణ కోస్తాలో శుక్ర, శని వారాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు, రేపు కొన్నిచోట్ల తీవ్రభారీ వర్షాలు, రాయలసీమలో శుక్ర, శనివారాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు, కొన్నిచోట్ల అతి తీవ్రభారీ వర్షాలు కురిసే అవకాశం వుందని తెలిపారు. మిగిలిన చోట్ల ఆదివారం వరకు విస్తారంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం వుందని, తీరం వెంబడి 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశంవుందని, ఆకస్మిక వరదల పట్ల లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

# సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

- ప్రజా పోరాటాలకు ప్రత్యేక ప్రణాళికలు
- సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** ప్రజల సమస్యల పరిష్కారాలకు అలుపెరగని పోరాటాలు చేస్తూ నిత్యం ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతున్న సిపిఎం తిరుపతి జిల్లా ప్రథమ మహాసభలను జయప్రదం చేసుకుందామని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పిలుపు నిచ్చారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులతో కలిసి ఆయన మహాసభల కరపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చెప్పిందొకటి చేసేది ఒకటిగా వ్యవహరిస్తోందని, ఇందుకు సంబంధించి ప్రజా పోరాటాలకు మహాసభల వేదికగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకుంటామన్నారు. ఓటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించి వాటిని అమలు చేయడానికి సాకులు వెతుక్కునే పరిస్థితులు ప్రస్తుతం ఉన్నాయన్నారు. దేశ, రాష్ట్ర రాజకీయాలలో సిపిఎం నిర్వహిస్తున్న పాత్ర ప్రజలందరికీ సుపరిచితమన్నారు. టిటిడి తమ ఉనికిని చాటుకోవడానికి రాజకీయ నాయకులు వాడుకుంటున్నారని, తిరుమల లడ్డూ విషయంలో సీఎం చంద్రబాబు ఎటువంటి విచారణ లేకుండా కల్తీ జరిగిందని చెప్పడం, ఏదో జరిగిపోయిందని సనాతన ధర్మం పేరుతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దీక్షలు చేపట్టి ప్రజలలో గందరగోళం సృష్టించారన్నారు. సత్యవేడు బిఎంకె కళ్యాణ మండపం వేదికగా ఆదివారం నిర్వహించే సిపిఎం జిల్లా మహాసభలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, మాజీ రాజ్యసభ సభ్యులు పెనుమల్లి మధు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మూలం రమేష్,

మహాసభల కరపత్రాలు అవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

భాస్కరయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్, కందారపు మురళి, అంగేరి పుల్లయ్య, వందలాదిమంది సిపిఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొంటారన్నారు. మహాసభల సందర్భంగా సిపిఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి సభ ఘన నివాళులు అర్పిస్తుందన్నారు. ఈ మహాసభలలో రెడ్ షర్ట్ వాలంటీర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తూ విచిత్ర వేషధారణలో కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తారన్నారు. ప్రదర్శన కార్యక్రమంలో డప్పు కళాకారులు తమ నైపుణ్యతను చాటుతారన్నారు. రెండు రోజులపాటు జరిగే జిల్లా ప్రతినిధుల సభలో జిల్లా ప్రజలు, సిపిఎం అనుబంధ సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి సుబ్రహ్మణ్యం, జిల్లా కమిటీ సభ్యులు సాయిలక్ష్మి, జయచంద్ర, సిపిఎం నగర కార్యదర్శి వేణుగోపాల్, సిపిఎం కార్యాలయ కార్యదర్శి కెఆర్ఎస్ మణ్యం పాల్గొన్నారు.

# టాస్క్ ఫోర్సు డీఎస్పీ ఎండీ షరీఫ్ బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):**
ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్సు డీఎస్పీగా ఎండీ షరీఫ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం టాస్క్ ఫోర్స్ ఇన్‌ఛార్జి, తిరుపతి ఎస్పి ఎల్ సుబ్బారాయుడును, టాస్క్ ఫోర్స్ ఎస్పి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎండి షరీఫ్ గతంలో కడప టౌన్ డీఎస్పీగా పని చేశారు. బాధ్యతలు చేపట్టిన ఆయన ఎర్రచందనం అక్రమ రవాణాను నిరోధించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

# నేడే పింఛన్లు పంపిణీ

- జిల్లాలో 2,64,636 మంది లబ్ధిదారులు
- రూ.112.26 కోట్లు పంపిణీ
- కలెక్టర్ డాక్టరు ఎస్ వెంకటేశ్వర్

**ప్రజాశక్తి -తిరుపతి టౌన్:** డిసెంబర్ 1వ తేదీ పంపిణీ చేయాల్సిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లు సచివాలయ సిబ్బంది ద్వారా ఈ నెల 30వ తేదీన జిల్లాలో 2,64,636 మంది లబ్ధిదారులకు సుమారు రూ.112.25 కోట్లు లబ్ధిదారుల ఇంటి వద్దకే వచ్చి పంపిణీ చేస్తామని, ఉదయం 6 గంటల నుండే ప్రారంభించాలని ఆలస్యం అయితే తప్పకుండా చర్యలు ఉంటాయని సచివాలయ సిబ్బందిని ఆదేశించామని కలెక్టర్ డాక్టరు ఎస్ వెంకటేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వృద్ధాప్య, వితంతు, చేనేత, కల్లుగీత కార్మికులు, ఒంటరి మహిళలకు, మత్స్యకారులకు, హెచ్ఐవి వ్యాధి గ్రస్తులకు, చర్మకారులకు, హిజ్రాలకు, డప్పు కళాకారులకు రూ.3 వేల నుండి రూ.4 వేలకు పెంచిందని, వికలాంగుల పెన్షన్‌లు రూ.3 వేల నుండి రూ.6 వేలకు, డిఎంహెచ్‌వో పెన్షన్ లు రూ.5వేల నుండి రూ.10వేల వరకు పెంచారన్నారు. ఇందులో శాశ్వత వికలాంగులకు రూ.5వేల నుండి రూ.15వేల వరకు పెంచారని తెలిపారు. డిసెంబర్ 1వ తేదీ ఆదివారం సెలవు కావడంతో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను ఒక రోజు ముందుగానే సచివాలయ సిబ్బంది ద్వారా లబ్ధిదారులకు శనివారం పంపిణీ చేయాలని ప్రభుత్వ ఆదేశించిన నేపథ్యంలో ఉదయం 6గంటలకే ప్రారంభిస్తామన్నారు. వంద శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేయాలన్నారు. మిగిలిపోయిన వారికి డిసెంబర్ 2వ తేదీన మాత్రమే పంపిణి చేయాలని తెలిపారు. బయట గ్రామాలకు వెళ్లినవారు కూడా వారి గ్రామాలలో అందుబాటులో వుండి పెన్షన్ తీసుకోవాలని, సంబంధిత మండల, సచివాలయ అధికారులు వారికి సమాచారం అందించి అందరూ అందుబాటులో ఉండేలా వారికి సమాచారం అందించి చర్యలు తీసుకోవాలని సూచించారు. పెన్షన్ లబ్దిదారులు ఎవ్వరు సచివాలయ కార్యాలయానికి రావలసిన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. రెండు నెలల పాటు వరుసగా పెన్షన్ తీసుకోకపోయినా మూడో నెలలో ఒకేసారి మొత్తం చెల్లించాలని, పెన్షన్ తీసుకుంటున్న కుటుంబ యజమాని మరణిస్తే భార్యకు మరుసటి నెలలో వితంతు పెన్షన్ మంజూరు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. గత నవంబర్ నెల 1వ తేదీన పెన్షన్ తీసుకోని 637 మందికి ఈ నెల30 తేదీన రెండు నెలల మొత్తం (నవంబర్, డిసెంబర్'24) అందిస్తామని వారికి సంక్షిప్త సందేశాలు, సమాచారం అందించాలని కలెక్టర్ తెలిపారు. సంబంధిత ఎంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్లు ఈ పెన్షన్లు సక్రమంగా పంపిణీ చేసేలా పర్యవేక్షించాలని ఆదేశించామని కలెక్టర్ పేర్కొన్నారు.

# పీఎఫ్ సొమ్ము, పెండింగ్ వేతనాలు ఇప్పించాలి

- పీఎఫ్ స్వాహా చేసిన కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలి
- సిఐటియు ఆధ్వర్యంలో రుయా ఏ ఒన్ సర్వీస్ కార్మికుల నిరసన

రుయా సూపరింటెండెంటు రవిప్రభుకు వినతిపత్రం అందిస్తున్న ఏఒన్ సర్వీసు కార్మికులు

**ప్రజాశక్తి- తిరుపతి టౌన్:** రుయాస్పత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం ఉదయం సిఐటియు ఆధ్వర్యంలో రుయా సూపరిం టెండెంట్ కార్యాలయం ఎదుట రుయా ఏఒన్ సర్వీసు కార్మికులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సూపరింటెండెంట్ రవి ప్రభు వినతి ప్రతం పరిశీలించారు. అనంతరం తన చాంబర్ లో కార్మికులు, సిఐటియు నేతలు, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్, మెటర్నటీ సూపరింటెండెంట్ సమక్షంలో సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ 'మూడు నెలల నుండి కార్మికులకు వేతనాలు చెల్లించకపోతే కార్మికులు ఎలా బతకాలి?' అని ప్రశ్నించారు. అసలే చాలీచాలని జీతాలు ఇస్తున్నారని 26 రోజులు డ్యూటీలు చేసిన కొంతమందికి ఏడువేలు, ఎనిమిది వేల రూపాయలు ఇచ్చి చేతులు దులిపేసుకుంటున్నారని వీరికి అందాల్సిన జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. జీతాల్లో కోతలు విధిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. మూడు సంవత్సరాల నుండి ఇప్పుడు ఉన్న ఏ వన్ సర్వీస్ కాంట్రాక్టరు రవికుమార్ పిఎఫ్ డబ్బులు కార్మికుల ఖాతాలో జమ చేయకుండా కార్మికులు అడిగితే వేస్తున్నామని కొంత మందికి 'మీకు పిఎఫ్ రాదని టెక్నికల్ ఇష్యూస్ వున్నాయి' అని మభ్యపెడుతున్నాడన్నారు. కార్మికుల అకౌంట్లో పిఎఫ్ డబ్బులు జమ చేయకుండా మూడు సంవత్సరాల పాటు కాలయాపన చేసి కార్మికుల డబ్బులు స్వాహా చేసిన ఏ వన్ సర్వీస్ కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ అకౌంట్‌కు డబ్బు చెలించకపోవడంతో కార్మికులకు ఏమైనా అనారోగ్య సమస్యలు వస్తే చూపించుకోలేకపోతున్నారని తెలిపారు .ప్రతి నెలా పే స్లిప్పులు ఇవ్వాలని, కార్మికులపై పని ఒత్తిడి తగ్గించాలని టెండర్లో ఎంతమంది వద్ద చేయించుకోవాలో ఆ సంఖ్య ప్రకారం కార్మికులను పనిచేయించాలన్నారు. రుయా హాస్పిటల్ యాజమాన్యం ఈ సమస్యలపై స్పందిస్తూ తక్షణమే కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేస్తామని కార్మికులకు మూడు నెలల జీతాలు చెల్లించాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌తో చర్చించి తక్షణం ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సూపరింటెండెంటు హామీ ఇచ్చారు. ఈ హామీ పరిష్కారమైతేనే కార్మికులు విధుల్లోకి వెళతామని లేకుంటే నిరసన యధాతధంగా కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె వేణుగోపాల్, సిఐటియు జిల్లా నేతలు టి సుబ్రహ్మణ్యం, ఎస్ జయచంద్ర, బుజ్జి, సాయి, లక్ష్మి, జయంతి, రాజు, చిన్న , తంజావూరు, మురళి, ఏ వన్ సర్వీస్ యూనియన్ అధ్యక్షులు ఎం నిర్మల, పి ఉషారాణి, నీలవేణి, మునెమ్మ, పార్వతి, లక్ష్మమ్మ, అమ్ములు పాల్గొన్నారు.

# పారిశుధ్య పనులు మెరుగు చేయండి: కమిషనర్

**ప్రజాశక్తి -తిరుపతి టౌన్:** నగర పాలక సంస్థ పరిధిలోని కరకంబాడి రోడ్డులోని బయోమెట్రిక్ టిమ్, తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని ఇంజినీరింగ్, హెల్త్ అధికారులను కమిషనర్ ఎన్ మౌర్య ఆదేశించారు. ఉపాధ్యాయ నగర్ రోడ్డు, బయో టిమ్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు, మురుగు నీటి కాలువల నిర్మాణంపై ఇంజినీరింగ్, హెల్త్, ప్లానింగ్ అధికారులతో కమిషనర్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బయో టిమ్, ఉపాధ్యాయ నగర్ రోడ్డు మధ్య ఉన్న మురుగునీటి కాలువ సరిగా లేదని, అపరిశుభ్రత ఎక్కువగా ఉందని, వీధి కుక్కలు లోనికి వస్తున్నాయని, జింకలు, దుప్పులు రోడ్లపై వస్తున్నాయని బయో టిమ్ అధికారులు, ప్రజలు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు తనిఖీ చేశారని తెలిపారు. మానస సరోవర్ నుండి వినాయక సాగర్ వరకు ఉన్న మురుగు నీటి కాలువను నిర్మించాలని ఇందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గోవింద ధామం ఎదురుగా చిన్న చిన్న దుకాణాలు ఉండడం వల్ల జింకలు, వాటికోసం చిరుత పులులు వస్తున్నాయని ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ దుకాణాలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. బయోటిమ్, తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు మెరుగ్గా చేపట్టాలని, వీధి కుక్కలు రాకుండా చర్యలు తీసుకోవాలని హెల్త్, వెటర్నరీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిసిపి మాహాపాత్ర, డిఈలు, ఏసిపిలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

## 'నాసిరకం ఎరువులు విక్రయిస్తే చర్య'

**ప్రజాశక్తి -కోట :** వ్యవసాయ రైతులకు నాసిరకమైన ఎరువులు అమ్మితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, వెంకట గిరి మండల వ్యవసాయ అధికారి డాక్టర్ నాగార్జు న్ సాగర్ హెచ్చరిం చారు. ఈ సందర్భంగా శుక్రవారం కోట మండలంలోని పలు ఎరువుల దుకాణాలను స్థానిక కోట మండల వ్యవసాయ అధికారి వి.నిరంజన్ కుమార్ ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో ఉండే ఎరువుల దుకాణాల్లో ఎరువులు కి సంబంధించిన పట్టికలను అందరికీ కనబడే విధంగా షాపు వద్ద ఉంచాలన్నారు. అందులో భాగంగా 2 షాపులలో 45.8 మెట్రిక్ టన్నులు ఎరువులను 'ఫారం'లు ఎరువుల లైసెన్సులలో నమోదు కాకపోవడం వల్ల 45.8 మెట్రిక్ టన్నులు ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. ఎరువుల లైసెన్సు కలిగిన డీలర్లు అందరూ ఎరువులను రిజిష్టర్ లో నమోదు చేయాలని, రైతులకు బిల్లులు ఇవ్వాలని, ఎమ్ఆర్‌పి ధరలకే అమ్మాలని, ఎరువుల నిల్వ వివరాలు, వాటి రేట్లను స్టాక్ బోర్డు లలో చూపాలని ఫారంను ఎరువుల లైసెన్సులో నమోదు చేసుకోవాలని ఎరువుల డీలర్లు అందరిని ఆదేశించారు. అలా కాకుంటే ఎరువుల డీలర్లపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

## 'ఒక్కటవుదాం..ఎదుగుదాం' ప్రచారం ప్రారంభం

**ప్రజాశక్తి -తిరుపతి టౌన్** ప్రతీ ఇండియన్‌కి తోడుగా 'ఒక్కటవుదాం.. ఎదుగుదాం' పేరుతో ఒక స్ఫూర్తిదాయకమైన బ్రాండ్ ప్రచారాన్ని లెజెండ్ రాహుల్ ద్రవిడ్‌తో కలిసి ఆవిష్కరించినట్లు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెకామిస్ ఎలిజబెత్వెం కటరామన్ అన్నారు. 'ఒక్కటవుదాం.. ఎదుగుదాం' కార్యక్రమంతో తమ కస్టమర్లతో దృఢమైన సంబంధా లను పెంపొందించు కోవడం ద్వారా, వారిని శక్తివంతంగా చేసి, వారి కలలను సాకారం చేసుకోవ డానికి వారికి సహాయం చేస్తామని తెలిపారు. గీత రచయిత కెఎస్ చంద్రబోస్ 'శ్రీరామ్ ఫైనాన్స్' సందేశానికి తెలుగు వెర్షన్ కోసం పదునైన సాహిత్యాన్ని రూపొందించారు. దిగ్గజ నటుడు నసీరుద్దీన్ షా హిందీ వెర్షన్‌కు తన గాత్రాన్ని అందించగా, ప్రశంసలు పొందిన గీత రచయిత మధన్ కార్కీ తమిళ వెర్షన్‌కు వివిధ ప్రాంతాల్లోని ప్రేక్షకులకు మనసుకు హత్తుకునేలా సాహిత్యాన్ని రాశారు. దేశ వ్యాప్త చొరవ 'ఒక్కటిగా ఎదుగుదాం' ప్రచారం సమగ్ర 360–డిగ్రీ మీడియా వ్యూహంతో ప్రింట్, డిజిటల్, టెలివిజన్, సోషల్ మీడియా, అవుట్‌డోర్ ప్లాట్ ఫారమ్ దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన థియేటర్ల ద్వారా ప్రేక్షకులను ఆకట్టుకోనుంది. శ్రీరామ్ ఫైనాన్స్ ప్రో కబడ్డీ లీగ్తో కూడా భాగస్వామిగా వుంది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఇండియా వర్సెస్ సౌతాఫ్రికా టి 20 క్రికెట్ సిరీస్ సమయంలో ఈ ప్రచారం ప్రసారం చేయనున్నారు.

# ముఖ్యమంత్రికి సాదర వీడ్కోలు

**ప్రజాశక్తి- తిరుపతి టౌన్:** చంద్రగిరి నియోకవర్గం నారావారిపల్లెలో ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు కర్మక్రియలు ముగించుకుని శుక్రవారం ఉదయం 11.05 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుండి తిరుగు పయనమైన ముఖ్యమంత్రి చంద్రబాబుకు పలువురు సాదర వీడ్కోలు పలికారు. డిఐజి షిమోషి బాజ్ పేయ్, కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, ఎస్పి సుబ్బరాయుడు, తిరుపతి మున్సిపల్ కమిషనర్ నారపు రెడ్డి మౌర్య, జెసి శుభం బన్సల్, ఎంఎల్ఏలు చంద్రగిరి పులివర్తి నాని, శ్రీకాళహస్తి బొజ్జల సుధీర్ రెడ్డి, సత్యవేడు కోనేటి ఆదిమూలం, నగరి భాను ప్రకాష్, సూళ్లూరుపేట నెలవల విజయశ్రీ, పూతలపట్టు మురళి, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, శ్రీధర వర్మ, అధికారులు ముఖ్యమంత్రికి సాదర వీడ్కోలు పలికారు.

సిఎంకు వీడ్కోలు పలుకుతున్న ఎమ్మెల్యేలు ఆదిమూలం, మురళి

# ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి ..

గూడూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :**
ప్రపంచ ఎయిడ్స్‌డేను పురస్కరించుకొని స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాలుగు రోజుల నుండి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఎయిడ్స్ రహిత సమాజం నిర్మించుకోవాలని హెచ్ఐవిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని కళాశాల అధ్యాపకులు, విద్యార్థినివిద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ కే శివప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజం దేశ అభివృద్ధికి ఎంతైనా అవసరమని ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఆరోగ్యంపై దృష్టి సారించి హెచ్ఐవి లాంటి ప్రాణాంతక వ్యాధులను పూర్తిగా అరికట్టాలని పిలుపు నిచ్చారు. అనంతరం విద్యార్థులకు రంగోలి పోటీలు, వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలు నిర్వహిం చడమే కాకుండా ఆరోగ్యకరమైన సమాజం కోసం అందరూ ముందుండాలని మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వై శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పి విజయమహేష్, రెడ్ రిబ్బన్ కోఆర్డినేటర్ డాక్టర్ బి పీర కుమార్, అధ్యాపకులు శ్రీధర్ శర్మ, కిరణ్మయి, నారాయణరాజు, డాక్టర్ ఝాన్సీ, వాణి, మైమూన్, డాక్టర్ కే కోటేశ్వరరావు, డాక్టర్ సురేంద్ర, రవిరాజు, లక్ష్మీ హిమబిందు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

**శ్రీకాళహస్తి:** ఎయిడ్స్ మహమ్మారికి శాశ్వత చికిత్స లేదనీ, నివారణే సాధ్యమని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం 'రెడ్ రిబ్బన్ క్లబ్' అవగాహన ర్యాలీ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కో ఆర్డినేటర్ శైలజ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నిర్మూలనపై ప్రజలకు నినాదాల ద్వారా అవ గాహన కల్పించారు. అధ్యా పకులు దీన దయాల్ , డాక్టరు మాలతి గాబ్రియే ల్, నరసింహా రావు, శ్రీకాంత్ రెడ్డి, డాక్టరు నీరజ, సుమతి, అనూజ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో మానవహారం నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థినులు

# ఎర్రచందనం స్మగ్లర్లు ఏడుగురికి ఆరేళ్లు జైలు

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):**
ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడ్డ ఏడుగురి నిందితులకు ఆరేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.6 లక్షల జరిమానా విధిస్తూ తిరుపతి ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. ఎర్రచందనం అక్రమ రవాణా కేసులలో నిర్దిష్టమైన ఆధారాలను సేకరించి కోర్టుకు సమర్పించడంతో దోషులకు శిక్షలు పడుతున్నాయని టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు. గతంలో కరకంబాడి బీటు తిమ్మినాయుడుపాలెం సెక్షన్లో పట్టుబడిన ఏడుగురు నిందితులకు ఈ శిక్షను న్యాయమూర్తి విధించారన్నారు. వీరిలో చిత్తూరు జిల్లాకు చెందిన అద్దంకి గంగాధరం, తుపాకుల గంగయ్య, తుపాకుల శ్రీనివాసులు, గుండ్రాళ్ల మునయ్య, పాముల నాగయ్య, టి. బంగారయ్య, తమిళనాడుకు చెందిన కే. మురగయ్య ఉన్నారన్నారు. కోర్టు ఆదేశాలతో వీరిని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. దీనిపై టాస్క్ ఫోర్సు ఎస్పి పి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని శేషాచలం రిజర్వు ఫారెస్టులోని విలువైన ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేసే నేరస్తులకు శిక్ష తప్పదని హెచ్చరించారు.

మాట్లాడుతున్న డీఈవో కెవిఎన్ కుమార్

# స్కూల్ లీడర్‌షిప్ శిక్షణ తనిఖీ

**ప్రజాశక్తి -రామచంద్రాపురం:**
మండలంలోని సి రామాపురం వెరిటాస్ సైనిక్ స్కూలులో నిర్వహిస్తున్న స్కూల్ లీడర్‌షిప్ డెవలప్‌మెంటు ప్రోగ్రాం రెండవ దశ మూడవ బ్యాచ్‌ను డీఈవో కెవిఎన్ కుమార్ శుక్రవారం ఆకస్మి కంగా తనిఖీ చేశారు. తిరుపతి, నెల్లూరు, అన్నమయ్య జిల్లాల నుండి వచ్చిన స్కూల్ హెడ్స్, మండల విద్యాశాఖ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఎలా బోధించి మిగిలిన విద్యార్థుల వలే అన్నింటిలోనూ రాణించే విధంగా కార్యక్రమాలను రూపొందించాలో తెలిపారు. అనంతరం శిక్షణా తరగతులకు హాజరైన ఉపాధ్యాయులకు వసతి, భోజన సదుపాయాలను గురించి ఆరా తీశారు. ఏదైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. డిసెంబర్ 7వ తేదీ మెగా పేరెంట్స్ డేని విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ మోనిటరింగ్ అధికారి ఎస్ శివ శంకరయ్య, ఏఎస్ఓ సారధి, కైవల్య ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధి శంకర్ పాల్గొన్నారు.

# మూడు వేల ఎకరాలు కొట్టేశారు!

- అవినీతి వైసీపీ నేతలకు జైలు తప్పదు
- నాలుగు రోజుల్లో కొంత మంది అరెస్టు
- ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:**
శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సుమారు మూడు వేల ఎకరాలను గత ఐదేళ్ల పాలనలో వైసీపీకి చెందిన వారు కొట్టేశారని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆరోపించారు. ఈ అవినీతి, అక్రమాలకు కారణమైన వైసీపీ నాయకులు, కార్యకర్తలకు జైలు తప్పదని స్పష్టం చేశారు. మూడు, నాలుగు రోజుల్లో కొంత మందిని అరెస్టు చేసే అవకాశముందని చెప్పారు. టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వ, కొంత మంది రైతుల భూములను బలవంతంగా ఆక్రమించుకుని తమపై ఆన్ లైన్ లో నమోదు చేసుకున్నారనే విషయాలు విచారణలో వెలుగు చూశాయని తెలిపారు. ప్రభుత్వ శాఖ కార్యా లయాల్లో అక్రమాలకు పాల్పడిన, దౌర్జన్యాలతో ఇబ్బందులకు గురిచేసిన ప్రతి ఒక్కరూ జైలుకు పోక తప్పదన్నారు. వైసీపీ నాయకత్వంలో ఎవరెవరు ఎక్కడెక్కడ తప్పులు చేశారో వారు జైలుకు వెళ్లబోతున్నారని తెలిపారు. చట్టం తనపని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో అభివృద్ధిని మరచి అక్రమార్జనే ధ్యేయంగా వైసీపీ పాలన నడిచిందన్నారు. దాని ఫలితంగా శ్రీకాళహస్తిలో అభివృద్ధి ఇరవై ఏళ్ల వెనకకు పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు దాన్ని సరిచేసుకుంటూ అభివృద్ధి బాట పట్టించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. మరో నెల రోజుల్లో నియోజకవర్గం మొత్తం రోడ్ల మరమ్మతు పనులు ప్రారంభమవుతాయన్నారు. ఒకే సారి కాకుండా కొద్దికొద్దిగా అభివృద్ధి పనులకు నిధులు తీసుకొస్తున్న విషయాన్ని వివరించారు. అభివృద్ధితో శ్రీకాళహస్తిని ఆదర్శవంతంగా నిలపడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

## ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంటు ప్రోగ్రాం

మాట్లాడుతున్న అతిథులు

**ప్రజాశక్తి -రామచంద్రాపురం:** మండలంలోని వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశా లలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రంలో జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం, సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల ఫార్మసీ ప్రాక్టీస్ విభాగం సంయుక్తంగా నిర్వహించిన రైజ్ ఆఫ్ డిజిటల్ ఫార్మసీ పై శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఐదు రోజుల నుండి నిర్వహిస్తున్న ఈ శిక్షణ తరగతులను శుక్రవారం విజయవంతంగా ముగించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం నిరంజన్ బాబు మాట్లాడుతూ ఆధునిక మార్పులకు అనుగుణంగా బోధన పద్ధతులను అలవర్చు కోవాలన్నారు. ఈ శిక్షణలో జేఎన్టీయూ పరిధిలోని అధ్యాపకులకు శిక్షణ పూర్తి చేసుకున్నట్లు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ లక్ష్మయ్య, వైస్ ప్రిన్సిపల్ ప్రసన్న రాజు, ప్రొఫెసర్ శరవణ కుమార్, డాక్టర్ సతీష్ కుమార్, కోఆర్డినేటర్ జ్యోతి బసిని, కళాశాల బోధన, బోధ నేతల సిబ్బంది పాల్గొన్నారు.

## 'సూక్ష్మ కవితలు' పుస్తకావిష్కరణ

పుస్తక ఆవిష్కరణ చేస్తున్న తెలుగు అధ్యాపకులు

**ప్రజాశక్తి - క్యాంపస్ :** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ తెలుగు అధ్యయన శాఖలోని విభాగాతిపతి ఆచార్య రాజేశ్వరమ్మ అధ్యక్షతన సమావేశ మందిరంలో ఆచార్య ఎస్జీడీ చంద్రశేఖర్ రాసిన 'సూక్ష్మ కవితలు -2' ఆవిష్కరణ కార్యక్రమాన్ని తెలుగు అధ్యయన విభాగం, ఈతరం కవితా వేదిక సంయుక్తంగా శుక్రవారం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆచార్య ఎస్జీడి చంద్రశేఖర్ తెలుగు విభాగంలో పీజీ, పీహెచ్‌డి చేసి, అధ్యాపకులుగా చేరి ఆచార్యులుగా ఉద్యోగోన్నతి పొంది, వర్సిటీలో ప్రిన్సిపల్ గా తదితర పాత్రలలో నాలుగు దశాబ్దాలకు తెలుగు అధ్యయన శాఖకు కృషి చేశారని కొనియాడారు. కవిగా హేమంత వసంతిక, ఎస్జీడీలు, సూక్ష్మ కవిత-1, సూక్ష్మ కవితలు -2 పుస్తకాలు రచించారని చెప్పారు. ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ మనుషులతో సున్నితంగా వ్యవహరించే ఎస్జీడీ చంద్రశేఖర్ కవిత్వం కూడా అత్యంత సున్నితంగా సృజించారని కొనియాడారు. ఈ తరం కవితా వేదిక అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తిలక్, శ్రీ శ్రీ ప్రభావంతో ఎస్జీడీ చంద్రశేఖర్ గొప్ప కవిత్వాన్ని రాశారని చెప్పారు. తాను కవిత్వం రాయడమే కాక కొత్త తరం కవులను ప్రోత్సహిస్తూ ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు విశ్రాంతాచార్యులు మేడిపల్లి రవికుమార్, ఎన్ మునిరత్నమ్మ, కాటూరి శారద, కె. మునిరత్నం, ఎలవర్తి చంద్రమౌళి, సాహిత్య వేత్తలు ఆర్‌సి కృష్ణస్వామి రాజు, ఎస్ హెచ్ సౌభాగ్యమ్మ, ఆకుల మల్లేశ్వరరావు, సింగార బాలమురళీకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అమ్మవారికి టిటిడి మహిళా ఉద్యోగుల సారె

పద్మావతి బ్రహ్మోత్సవాలకు సారె అందిస్తున్న టిటిడి మహిళా ఉద్యోగులు

**ప్రజాశక్తి -తిరుపతి సిటీ:** తిరుచానూరులో జరుగుతున్న వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం టిటిడి మహిళా ఉద్యోగులు శ్రీ పద్మావతి అమ్మవారికి పట్టు వస్త్రాలు, సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో టిటిడి జెఈఒ గౌతమి, ఉన్నతాధికారుల సతీమణులతో పాటు టీటీడీ మహిళా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## అబద్ధపు ప్రచారాలు మానుకో..

### చెవిరెడ్డికి ఎమ్మెల్యే పులివర్తి సూచన

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** ఓ బాలిక విషయంలో ఏమి జరగకుండానే ఏదో జరిగిందని వైసిపి సోషల్ మీడియా వేదికగా అబద్ధపు ప్రచారాలు చేశారని, ఇకనైనా అటువంటి ప్రచారాలను మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సూచించారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలికపై అత్యాచారం జరిగితే ఆ బాధిత కుటుంబం గురించి ఎటువంటి వివరాలను బయటకు తెలపకూడదని, బాలికలపై అత్యాచారాలను నిర్మూలించడానికి 2012లో అప్పటి ప్రభుత్వం తీసుకొచ్చిన పోక్సో చట్టం గురించి లా చదువుకున్నానని చెబుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి తెలియదా? అని ప్రశ్నించారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై 5వ తేదీనే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, కాని ఇప్పటికిప్పుడు చేశారని ప్రచారం చేసుకుంటున్నారన్నారు. గతంలో తాను చంద్రగిరి నుండి పోటీ చేసి ఓటమి చెందానని, ఏనాడూ ఇలా ప్రజల గురించి అబద్ధపు ప్రచారాలు చేసి మీడియాలో ప్రజల దృష్టిలో పడాలని అనుకోలేదన్నారు. [illegible] ఈ సమావేశంలో తిరుపతి రూరల్ మండలం అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం నాయుడు, గౌస్ బాషా, చంద్ర, మాజీ తూడా సభ్యులు బాలకృష్ణమూర్తి పాల్గొన్నారు.

## చెత్త బుట్టలు పంపిణీ

చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** మంగళం పరిధి తిరుమల నగర్ గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి స్వాతి శ్రీ ఆధ్వర్యంలో ఇంటింటికి చెత్త బుట్టలు అందించారు. రామచంద్ర నగర్ లో టిడిపి నాయకులు ప్రభాకర్ అక్కడి ప్రజలకు పారిశుధ్యంపై పలు సూచనలు చేసి, చెత్త బుట్టలను అందించారు.

## ఎస్వీయూలో భద్రత గాలికి..

షూటింగులు నిర్వహిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి - క్యాంపస్ :** గత ప్రభుత్వ కాలంలో వర్సిటీ ఉన్నతాధికారులు [illegible]

# సిటీ ఆపరేషన్ సెంటర్‌ను త్వరగా పూర్తి చేయండి

### స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షలో ఎండీ మౌర్య

**ప్రజాశక్తి -తిరుపతి టౌన్:** నగరంలో పాత మున్సిపల్ కార్యాలయం స్థానంలో స్మార్ట్ సిటీ నిధులతో నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య అధికారులను ఆదేశించారు. స్మార్ట్ సిటీ నిధులతో నిర్వహిస్తున్న వివిధ ప్రాజెక్టుల పురోగతిపై నిర్మాణ సంస్థల ప్రతినిధులు, స్మార్ట్ సిటీ అధికారులతో శుక్రవారం సాయంత్రం మేనేజింగ్ డైరెక్టర్ సమీక్షించారు. ముఖ్యంగా సిటీ ఆపరేషన్ సెంటర్, మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, గరుడ వారధి, మల్టి లెవల్ కార్ పార్కింగ్, స్విమ్మింగ్ పూల్, గ్లో గార్డెన్ ప్రాజెక్టులో కొనసాగుతున్న పనుల వివరాలను వివరించారు. ఐదు అంతస్తుల్లో నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్‌లో ఏర్పాటు చేయనున్న కార్యాలయాల వివరాలు తెలుసుకున్నారు. ఇందులో కొన్ని మార్పులు, చేర్పులు సూచించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ మౌర్య మాట్లాడుతూ నగరంలో ఎంతో ప్రతిష్టాత్మంగా నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ (నగరపాలక సంస్థ కార్యాలయం) పనులను గడువులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సిటీ ఆపరేషన్ సెంటర్ భవనంలో అధికారుల ఉద్యోగులకు సరిపోయేలా ఫర్నిచర్ తదితరాల సిద్ధం చేయాలని, గరుడ వారధిలో పెండింగ్ లో ఉన్న పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని ఆ సంస్థ ప్రతినిధులు ఆదేశించారు. మల్టి లెవల్ కార్ పార్కింగ్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, ఈఈ చంద్రశేఖర్, డిఈలు రాజు, మధు, లలిత, స్మార్ట్ సిటీ ఏఓరాజశేఖర్, సిఎఫ్ఓ, మల్లికార్జున, ప్రతినిధులు బాలాజీ, అనిల్, వివిధ నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అధికారులతో చర్చిస్తున్న కమిషనర్ మౌర్య

## డిప్యూటీ స్పీకర్‌కు ఘన సన్మానం

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజును ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను చొరవ తీసుకొని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణమరాజు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమావేశం ఏర్పాటు చేసి పరిష్కారాలను చూపుతామని హామీ ఇచ్చారన్నారు.

డిప్యూటీ స్పీకర్‌ను సన్మానిస్తున్న రఘురామకృష్ణమరాజు

## మహిళలకు యోగా శిక్షణకు కేంద్రం చర్యలు తీసుకుంటుందా ?

పార్లమెంటులో ప్రశ్నించిన తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి

**ప్రజాశక్తి -తిరుపతి టౌన్:** 'దేశంలోని గ్రామీణ మహిళలకు యోగా శిక్షణ అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏమైనా చర్యలు తీసుకుంటుందా?' అయితే రాష్ట్రాల వారీగా వివరాలు ఇవ్వాలని, లేని పక్షంలో అందుకు కారణాలు తెలపాలని తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తి పార్లమెంటులో శుక్రవారం ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు సమాధానంగా ఆయుష్ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ప్రతాపరావు జాదవ్ సమాధానం ఇస్తూ కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ తన స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థల ద్వారా గ్రామీణ మహిళలతో సహా ప్రజలకు యోగా శిక్షణ ఇస్తుందని తెలిపారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ తన మూడు స్వయంప్రతిపత్తి సంస్థలైన న్యూ ఢిల్లీలోని మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా, సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ యోగా, నేచురోపతి, పూణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి ద్వారా దేశంలో యోగాను ప్రోత్సహిస్తుందని తెలిపారు. మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా, యోగా విద్య కోసం వివిధ కోర్సులను అందిస్తుందన్నారు. సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ యోగా అనేది యోగా, నేచురోపతి వ్యవస్థలలో పరిశోధన, అభివృద్ధికి అత్యున్నత సంస్థగా పేర్కొన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి, నేచురోపతి విభాగంలో ఒక ప్రధాన సంస్థ అని ప్రకృతి వైద్యం, యోగాకు సంబంధించిన వివిధ కార్యకలాపాలను నిర్వహిస్తుందని తెలిపారు. ఈ మూడు సంస్థల కార్యకలాపాలు, ప్రోగ్రామ్‌లు వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉన్నాయన్నారు. యోగాతో సహా దేశంలోని వివిధ ఆయుస్ వ్యవస్థల అభివృద్ధి ప్రమోషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా జాతీయ ఆయుష్ మిషన్ కేంద్ర ప్రాయోజిత పథకాన్ని మంత్రిత్వ శాఖ అమలు చేస్తోందన్నారు. రాష్ట్ర వార్షిక ప్రతిపాదనల ప్రకారం ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. జాతీయ ఆయుష్ మిషన్ కింద, ఆయుష్ మంత్రిత్వ శాఖ రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రభుత్వాల ద్వారా 12,500 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యాచరణను అమలు చేస్తోందని తెలిపారు. ఈ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లలో, అర్హత కలిగిన యోగా శిక్షకుల ద్వారా సాధారణ ఆరోగ్య ప్రమోషన్‌లో భాగంగా గ్రామీణ మహిళ లతో సహా ప్రజలకు యోగా బోధిస్తున్నారా?' ఈ ప్రశ్నకు సమాధానంగా తెలిపారు.

## కన్నుల పండువగా నదీ హారతులు

- శివరాత్రిలోపు సుందరీకరణ పనులు పూర్తి
- ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** ముక్కంటి క్షేత్రంలో శనివారం జరగనున్న స్వర్ణ ముఖి నది హారతుల కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహిస్తామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలోపు స్వర్ణముఖి నది కరకట్ట సుందరీకరణ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నదీ హారతులు నిర్వహించే స్వర్ణముఖి ఘట్టాలను శుక్రవారం ఈవో బాపిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఏర్పాట్లపై ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. వచ్చే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను గతం కన్నా మిన్నగా నిర్వహిస్తామనీ, ఆధ్యాత్మిక శోభకు తోడు, పర్యాటక శోభను అద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు చెంచయ్య నాయుడు, విజయ్ కుమార్ నాయుడు పాల్గొన్నారు.

స్వర్ణముఖి నదిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

## సంస్కృత విశ్వవిద్యాలయంలో డగ్స్ వినియోగం అవాస్తవం

ఇన్‌ఛార్జి రిజిస్ట్రారు ప్రొఫెసర్ ఆర్‌జె రమాశ్రీ

**ప్రజాశక్తి - క్యాంపస్ :** జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఇటీవల డ్రగ్స్ వినియోగిస్తున్నారని వచ్చిన వార్తలు అవాస్తమని, డ్రగ్స్ సంబంధించి ఆనవాళు ఏమీ కూడా ఫిజికల్, లేబొరేటరీ నివేదికలలో లేవని ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్‌జె రమాశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధించిన అనుమానిత కేసుకు సంబంధించిన విషయంలో విశ్వవిద్యాలయం యాంటీ డ్రగ్ కమిటీ, విశ్వవిద్యాలయం అధికారులు ఆరోపణలు వచ్చిన ఇద్దరు విద్యార్థులను ఎస్‌విఆర్‌ఆర్ (రుయా) ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు గతంలో పత్రికా ప్రకటనకు కొనసాగింపుగా వివరణ ఇచ్చామన్నారు. ఇద్దరు విద్యార్థులను భౌతిక, లేబొరేటరీ ప్రయోగశాల ద్వారా పరీక్షణ చేసి, ఎటువంటి డ్రగ్ వినియోగం చెయ్యలేదని, తెలియని పదార్థాలను తనిఖీ, పరిశోధన చేసి నివేదికలో నిర్ధారించామన్నారు. డ్రగ్స్ ఫ్రీ క్యాంపస్‌ని నిర్ధారించడానికి భారత ప్రభుత్వం జారీ చేసిన నియమాలను విశ్వవిద్యాలయం పాటిస్తూ సర్వదా డ్రగ్స్ రహిత వాతావరణం నెలకొల్పాలని సూచించామన్నారు.

## మెగా 'ప్యారెంట్స్, టీచర్ మీటింగ్'లపై అవగాహన




**ప్రజాశక్తి -కోట :** కోట మండలంలోని స్థానిక ఎంపిడిఓ కాన్ఫరెన్స్ హాల్‌లో స్థానిక మండల విద్యాశాఖాధి .కారులు శైలజ, మస్తానయ్యలు ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులతో పేరెంట్స్, టీచర్ల మీటింగ్‌పై శుక్రవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు శైలజ, మస్తానయ్యలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే నెల ఏడో తేదీన మెగా పేరెంట్, టీచర్ సమావేశం నిర్వహించనున్నారు. మండలంలోని ప్రాథమిక, ఉన్నత, రెసిడెన్షియల్ పాఠశాలలు, ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఈ సమావేశం నిర్వహిస్తారన్నారు. డిసెంబర్ 7వ తేదీ నిర్వహించబోయే పేరెంట్స్ టీచర్ మీటింగ్ లపై పలు సూచనలు,సలహాలను ప్రధానోపాధ్యాయులకు అందజేశారు.విద్యార్థులకు ఈ ఏడాది ఇంతవరకూ నిర్వహించిన ఎఫ్ఎ-1,2 పరీక్షల మార్కుల కార్డు, ఆరోగ్య సంబంధిత పరీక్షల వివరాలతో కూడిన కార్డులు అందజేస్తారు. విద్యార్థి చదువుపై తల్లిదండ్రులతో సంబంధిత టీచర్ చర్చిస్తారు. తరువాత విద్యార్థులు, తల్లిదండ్రులు,టీచర్లతో సమావేశం నిర్వహించి పాఠశాలకు పలు ఇతోధికంగా సాయంచేసిన వ్యక్తులకు సన్మానిస్తారని తెలిపారు.పాఠశాలల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం పెంచడం ఈ మెగా పేరెంట్,టీచర్ సమావేశాల ప్రధాన ఉద్దేశమని ఎమ్ ఈ ఓ లు శైలజ,మస్తానయ్య అన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను సమాజానికి అందించడం,పాఠశాలకు అవసరమైన వసతుల కల్పనలో ప్రజల చేయూత, తదితర అంశాల కోసం సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు.

## కాంగ్రెస్ అభివృద్ధికి కృషి: లోకేష్ రెడ్డి

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** చంద్రగిరి నియోజకవర్గంలో పార్టీ క్షేత్రస్థాయి అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన ఐరాల లోకేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో బలపడడానికి యువకులకు తగిన ప్రాధాన్యతని ఇస్తూ పదవులను కేటాయిస్తున్నారన్నారు. ఉమ్మడి రాష్ట్ర ఆంధ్రప్రదేశ్ విభజనకు కారణం కాంగ్రెస్ అని ప్రజలలో తక్కువ చేసి చూపడం సరికాదని, దేశానికి కాంగ్రెస్ నాయకత్వం ఎంతో అవసరమని గుర్తు చేశారు. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన పార్టీ ఏదైనా ఉంటే అది కాంగ్రెస్ అని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ్టకి ప్రజలలో ఆదరణ లభిస్తోందని, దాని ఫలితాలు ఇటీవల జరిగిన ఎన్నికలలో ని స్పష్టంగా బయటపడ్డాయని గుర్తు చేశారు. తనకు ఇంతటి ప్రాధాన్యత బాధ్యతను ఇచ్చిన ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల రెడ్డికి, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, పార్లమెంటు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి, రాష్ట్ర, జిల్లా, పట్టణస్థాయి కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు చిత్తూరు శివశంకర్, ఎస్టీ సెల్ నాయకులు జ్యోతీశ్వర్ నాయక్, కళిందర్, శివ బాలాజీ, చిరంజీవి, తలారి గోపి పాల్గొన్నారు.

## దాడి చేసిన అగ్రవర్ణాలపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

### తహశీల్దారు కార్యాలయం ఎదుట గిరిజనుల ధర్నా

**ప్రజాశక్తి -తిరుపతి టౌన్:** తిరుపతి జిల్లా చిన్న గొట్టిగల్లు మండలం తుమ్మచెను పల్లి గ్రామ నివాసి గిరిజన సామాజిక వర్గానికి చెందిన లక్ష్మీకాంత వద్ద ప్రభుత్వ పట్టా, స్థలాన్ని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించిన అగ్రవర్ణాల దౌర్జన్యానికి వ్యతిరేకిస్తూ చిన్నగొట్టి గల్లు మండల తహశీల్దారు కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె హరినాథ్ ఆధ్వర్యంలో గిరిజనులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ నాగరాజు, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె హరినాథ్, డిహెచ్‌పిఎస్ తిరుపతి జిల్లా కార్యదర్శి చిన్నం కాలయ్య మాట్లాడుతూ 1998 లో కలెక్టర్ ఆదేశాల మేరకు తుమ్మచెనుపల్లిలో ఎరుకుల కులానికి చెందిన బి లక్ష్మీకాంత భర్త భగవంతుడు పేరున రెండు సెంట్లు ఇంటి స్థలం, లక్ష్మీకాంత మామ సిద్ధప్ప పేరున రెండు సెంట్లు ఇంటి స్థలం, రెవెన్యూ అధికారులు మంజూరు చేసిన ఇంటి స్థలాన్ని అదే గ్రామానికి చెందిన దొరస్వామి రెడ్డి, కైలేశ్వర్ రెడ్డి, రెడ్డప్ప రెడ్డి, గోపాల్ రెడ్డి, గోవిందమ్మ, లక్ష్మమ్మ, సుబ్రహ్మణ్యం రెడ్డి, దేవేందర్ రెడ్డి, రెడ్డమ్మ కలసి అగ్రవర్ణాలు వారు దౌర్జన్యంగా లక్ష్మీకాంత పై దాడి చేయడమే కాకుండా ఆమె ఇంటిని ఈ నెల 26 తేదీ తమ ఇంటి ఆవరణలోని ఇంటి పునాది రాళ్లను గడ్డపారలతో దౌర్జన్యంగా వచ్చి తవ్వి ధ్వంసం చేశారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ధర్నా అనంతరం చిన్నగొట్టిగల్లు మండల కార్యాలయం డిప్యూటీ తహశీల్దారు వాసుదేవ కుమార్‌కు గిరిజన సంఘం నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎరుకుల ప్రజా సంక్షేమ సేవా సంఘం నెల్లూరు జిల్లా నాయకులు ఎస్ ఆనంద్, ఎన్ మునిరాజా, ఏకలవ్య, ఎరుకుల సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి సి ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి ఈశ్వరమ్మ , నాయకులు రామాంజనేయులు, రాజేష్, రేణుకమ్మ , సుప్రజ , నాగరత్నమ్మ, గీత పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న గిరిజనులు

## డివైడర్‌తో ప్రమాదాలు అధికం

**ప్రజాశక్తి -కోట :** సిగ్నల్స్ లేని డివైడర్ ల వల్ల తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని వ్యాపారవేత్త ఈతముక్కల జగదీష్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం కోట మండలంలోని విద్యానగర్ లో భాలభారతి స్కూల్ నుండి చివర పెట్రోల్ బంక్ వరకు గతంలో ఓ కాంట్రాక్టర్ డివైడర్ ను నిర్మించారు. అయితే అప్పటి నుండి ఇప్పటి వరకు సరైన సిగ్నల్స్ సూచిక బోర్డులు పెట్టకపోవడంతో ఎక్కువుగా లారీలు,కార్లు ప్రమాదానికి గురయ్యాయి. అంతేకాకుండా రోడ్డు మధ్యలో ఉండే డివైడర్ కనబడక మరెన్నో సార్లు లారీలు,కార్లు డివైడర్ లో మధ్యలో ఇరుక్కుపోయిన సందర్భాలు చాలా ఉన్నాయని స్థానిక వ్యాపారవేత్త జగదీష్ నాయుడు తెలియజేశారు.శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ఓ కారును వెనుకవైపు నుండి డీ కొనడం జరిగింది.ఇప్పటికైనా ఆర్ అండ్ బీ అధికారులు పరిశీలించి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుకోవాలని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

## ఫిబ్రవరి 16న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

మాట్లాడుతున్న బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** వచ్చే ఏడాది ఫిబ్రవరి 16వ తేదీ రాష్ట్ర ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా బ్రాహ్మణ సమాజం వారు రాష్ట్ర బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదికను గూడూరు ఆది శంకరాచార్య బ్రాహ్మణ సేవా సంఘం సహకారంతో నిర్వహిస్తున్నట్లు శుక్రవారం తెలిపారు. గూడూరు పట్టణం లోని సమాజ కార్యాలయంలో సమావేశంలో సంఘ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమైక్య, తిరుపతి జిల్లా బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ కార్యక్రమాన్ని, షష్టిపూర్తి భీమర దశ శాంతి మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రాహ్మణు లందరూ కలిసి వచ్చి పరిచయ వేదికలో నూతన వధూవరులను , నివేదిక ద్వారా పరిచయం చేసి వారి బంగారు భవిష్యత్తుకు మార్గం వేసుకోవాలని సూచించారు. ఈ వివాహ పరిచయ వేదికను అందరూ సద్వినియోగ పరచుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ తదితర వివరాలకు ఈ కార్యక్రమానికి కన్వీనర్ రాష్ట్ర యువజన అధ్యక్షుడు , తిరుపతి బ్రాహ్మణ సమాజం సంయుక్త కార్యదర్శి ఈ కార్యక్రమ కన్వీనర్ వేదం హరిప్రసాద్ ( 9949349851), కుందేరు నారాయణ (9494415229) ఫోను నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

## ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ

**ప్రజాశక్తి -తిరుపతి సిటీ:** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండో రోజు శుక్రవారం ఉదయం నిర్వహించిన పెద్దశేష వాహన సేవలో నాలుగు ఆధ్యాత్మిక పుస్తకాలను టీటీడీ ఈవో జె శ్యామలరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్, ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారి డాక్టరు ఆకెళ్ల విభీషణ శర్మ, ఉపసంపాదకులు డా. నరసింహాచార్య, రచయితలు పాల్గొన్నారు.

## మండలానికి ఓ ప్రతినిధి: ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** నియోజకవర్గ ప్రజా సమస్యల పరిష్కారానికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సరికొత్త పంథాను ఎంచుకున్నారు. అర్జీదారుల సమస్యలను పరిష్కరించడంలో మధ్యవర్తుల అవసరం లేదంటూ మండలానికో ప్రతినిధిని నియమించారు. వారి వివరాలను స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం టిడిపి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి వెల్లడించారు. శ్రీకాళహస్తి అర్బన్‌కు పూల మనోజ్ కుమార్ (సెల్: 9491706316), రూరల్ మండలానికి మణెమ్మ(సెల్: 7032178191), తొట్టంబేడు మండలానికి భారతి(సెల్: 9182031426), ఏర్పేడుకు హేమ(సెల్: 9441855838),రేణిగుంటకు సుజాత(సెల్: 8367090320)లను నియమించినట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే ఆయా మండలాల ప్రతినిధులకు ఫోన్ ద్వారా గానీ, స్వయంగా కాని సమాచారం అందించి పరిష్కరించుకోవాలని సూచించారు.

## బాల్య వివాహ రహిత 'ఆంధ్రప్రదేశ్'

### ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** బాల్య వివాహాల రహిత ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దుతామని ఐసిడిఎస్ అధికారు లు సూపరువైజరు గీతాంజలి ఆధ్వర్యం లో శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపరువైజర్ గీతాంజలి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. బాలల విద్య, హక్కులు పరిరక్షణ చేసుకోవాల్సిన అవసరం వుందని బాల్య వివాహాలు చేసు కోకుండా ఈ వయసులో చదువు పై శ్రద్ధ వహించాలని విద్యార్థులకు తెలిపారు. అనంతరం ప్రిన్సిపల్ ఎస్ శ్రీదేవి మాట్లాడుతూ బాల్యవివాహాల చేసుకోవడం వల్ల కుటుంబం మొత్తం పేదరికానికి గురి అవుతుందని దాని వల్ల సమాజంలో అభివృద్ధి కుంటుపడుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థినులతో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులు తీసుకోవలసిన జాగ్రత్త గురించి ఎంపి హెచ్ లావణ్య, మహేశ్వరి తెలిపారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ చంద్రకళ, గురుకులం టీచర్స్ ధనమ్మ, సౌజన్య, భారతి, చిట్టి, గాయత్రి, సరళ, కవిత పాల్గొన్నారు.

## అన్యాయాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులా..?: ఎమ్మెల్సీ

**ప్రజాశక్తి -కోట :** పేదలకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించినందుకు మాజీ జెడ్పిటిసి ఉప్పల ప్రసాద్ గౌడ్ పై కేసులు పెట్టడం అన్యాయమని ఎమ్మెల్సీ మేరిగ మురళి అన్నారు. శుక్రవారం కోట మండలంలోని కొత్తపట్నం పంచాయతీ పరిధిలో నివాసం ఉంటున్న మాజీ జడ్పిటిసి ఉత్తల ప్రసాద్ గౌడ్ పై ఇటీవల అక్రమంగా కేసులు పెట్టడం తెలిసిందే..ఈ నేపథ్యంలో ప్రసాద్ గౌడ్ ను ఎమ్మెల్సీ మేరిగ మురళి పరామర్శించి మనోధైర్యాన్ని నింపారు. అనంతరం ఎమ్మెల్సీ విలేకరులతో మాట్లాడుతూ గడిచిన ఏడు నెలల మీ ప్రభుత్వంలో మరెన్నో రౌడీయిజాలు, హత్యలు పెరిగిపోయాయని, అన్యాయాలను ఎదుర్కొంటున్న ప్రజలకు కూటమి ప్రభుత్వంలో రక్షణ లేకుండా పోతుందని ఎద్దేవా చేశారు. రాష్ట్రస్థాయిలో అత్యధికంగా శాంతి భద్రతలు కాపాడడంలో కోటమే ప్రభుత్వం విఫలమవుతుందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో ఉండే వారి వారి వ్యక్తిగత సౌలభ్యం కోసం అమాయకులను బలి చేస్తున్నారని కూటమి ప్రభుత్వంపై మండిపడ్డారు. ఇటీవలన గూడూరు నియోజకవర్గంలో పలు హత్యలు జరిగాయని ఎమ్మెల్సీ మేరిగ మురళి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్ రెడ్డి, సిద్దవరం సొసైటీ ఛైర్మన్ పాదర్తి రాధాకృష్ణారెడ్డి, చిట్టమూరు మండల కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, సిద్ధవరం సర్పంచ్ భర్త,వైసీపీ నాయకులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

**IN THE COURT OF THE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE :: TIRUPATI**
**O.S.No.690 OF 2023**

K. Thulasi ...Plaintiff
Vs
M. Lavanya ...Defendant

**SUIT SUMMONS TO THE DEFENDANT**

To
M.Lavanya, W/o M.Gangadharam,
D.No.18-6-62, Madhura Nagar, Tirupati.

Please take suit summons in the above suit it is posted to 31.12.2024 for your appearance and you have to appear before the said court on that day, either by yourself or through your advocate at about 10.30 a.m. or else you will be set exparte and the case will be proceeded in your absence.

**Date of hearing: 31.12.2024**

M.VANI,
P. MURALIKRISHNA REDDY,
Advocates, Tirupati.